క్లుప్తంగా

ఘనంగా సీవీ రామన్ జయంతి



రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మండపేట: పట్టణంలోని సంఘం కాలనీలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో ప్రముఖ శాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత సర్ సీవీ రామన్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి హెచ్ఎం ముత్యాల మాణిక్యాంబ, ఉపాధ్యాయుడు చిట్టూరి శ్రీధర్ తదితరులు నివాళులర్పించారు. హెచ్ఎం మాణిక్యాంబ మాట్లాడుతూ వైజ్ఞానిక రంగంలో తొలి నోబెల్ అందుకున్న మహనీయుడు సీవీ రామన్ అని కొనియాడారు.

ఆటోడ్రైవర్‌కు తప్పిన ముప్పు



సంఘటనలో దెబ్బతిన్న ఆటో

మండపేట: ద్వారపూడి రోడ్డులో మంగళవారం సాయంత్రం ఆటోడ్రైవర్ త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకోగా, ఆటో ముందు భాగం దెబ్బతింది. తాపేశ్వరానికి చెందిన ఆటో డ్రైవర్ ప్రసాద్ సాయంత్రం వేళ స్కూల్ నుంచి పిల్లలను తీసుకువచ్చేందుకు మండపేట వస్తున్నాడు. అర్తమూరు తూము వద్ద ఎదురుగా గ్రావెల్ లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి వెనక్కు జారింది. వెనుకనే ఉన్న ఆటో ముందు భాగం దెబ్బతినగా, అప్రమత్తమైన డ్రైవర్ ప్రసాద్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

దోమల నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్

మండపేట: పట్టణంలో దోమల నిర్మూలనకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ పర్యవేక్షణలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.లావణ్య మంగళవారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లోను దోమల మందు చల్లించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. డ్రైన్లలో యాంటీలార్వా, ఇన్సెక్ట్స్, తెల్లపురుగు నివారణకు మందులు స్ప్రే చేయించామన్నారు. డ్రైన్లలో చెత్త వేయరాదని కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాస్

మండపేట: కపిలేశ్వరపురం మండలం వెదురుమూడికి చెందిన ఆటో డ్రైవర్ గుత్తుల దుర్గాప్రసాద్ ఇటీవల ఆకస్మికంగా మృతిచెందడంతో మండపేట శెట్టిబలిజ సంఘం అతని కుటుంబానికి అండగా నిలిచింది. సంఘ అధ్యక్షుడు పంపన శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యులు విరాళాలు సేకరించి, రూ.13,001 మొత్తాన్ని మంగళవారం మండపేటలోని సంఘ కార్యాలయం వద్ద అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, సంఘ నాయకులు సూరంపూడి సత్యప్రసాద్, యాండ్ర బుజ్జి, పంపన కిట్టయ్య, గుత్తుల గోవిందు, దుర్గారావు, చొల్లంగి గోవిందు, గణేష్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



భట్లపాలికలో పారిశుద్ధ్య నిర్వహణలో పాల్గొన్న ఎంపీపీ, ఇతర ప్రజాప్రతినిధులు

కె.గంగవరం: గ్రామాల్లోని ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచితే ఆరోగ్యకరంగా ఉంటారని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. దంగేరు భట్లపాలిక గ్రామంలో మంగళవారం స్వచ్ఛత మనందరి బాధ్యత కార్యక్రమం జరిగింది. ప్రజాప్రతినిధులు, పారిశుద్ధ్య కార్మికులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికుల కొరత ఉందని, స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమంతో వారిపై పనిభారం తగ్గుతుందని చెప్పారు. జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, సర్పంచ్ యలమంచిలి పద్మావతి, ఎంపీటీసీ బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శి కడలి గౌరి, సొసైటీఅధ్యక్షులు వెంకటరమణ పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛత–మన బాధ్యత

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఇచ్చిన స్ఫూర్తితో మంగళవారం హసన్‌బాద, యనమదల గ్రామాల్లో స్వచ్ఛత–మన బాధ్యత కార్యక్రమం జరిగింది. ఆయా గ్రామాల సర్పంచ్‌లు నాగిరెడ్డి సతీష్‌రావు, పంపన వీరవెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, కేవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, ఉపాధి హామీ కూలీలు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించి, డ్రైన్లు శుభ్రం చేశారు. ఎంపీటీసీలు యెన్నం దేవి, నురుకుర్తి శ్రీరామకృష్ణ, ఈఓపీఆర్డీ ఎన్.షెలత్‌రాజు పాల్గొన్నారు.

గూడు కట్టుకోనివ్వరా..?

- కేశవరంలో పేదల ఇళ్ల స్థలాలపై ప్రతిపక్ష నేతల అడ్డంకులు!
- ఎమ్మెల్యే వేగుళ్ల, జనసేన నేత లీలాకృష్ణపై లబ్ధిదారుల ఆగ్రహం
- దిష్టిబొమ్మలను దగ్ధం చేసి నిరసన



దిష్టిబొమ్మలను కోడిగుడ్లు, చెప్పులతో కొడుతూ నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

మండపేట: 'ఎన్నికల ముందు పట్టాలిచ్చి స్థలాలూ చూపలేదు. సొంత ఇల్లు లేక ఏళ్ల తరబడి అద్దె ఇళ్లల్లో కాలం వెళ్లదీస్తున్నాం. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో స్థలం లెవెలింగ్ పనులు పూర్తిచేసి, త్వరలో మా సొంతింటి కల సాకారామవుతుందని సంబరపడుతుంటే.. పనులు అడ్డుకోవాలని చూస్తారా?' అంటూ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణపై కేశవరంలోని ఇళ్ల స్థలాల లబ్ధిదారులు మండిపడ్డారు. అమ్మ పెట్టదు, అడుక్కోనివ్వదన్న చందాన వారి వైఖరి ఉందంటూ ఎమ్మెల్యే, జనసేన నాయకుడి దిష్టిబొమ్మలను కోడిగుడ్లు, టమాటాలు, చెప్పులతో కొట్టి దగ్ధం చేశారు. కేశవరంలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

పూర్వాపరాలివీ..

కేశవరంలోని 384 మంది లబ్ధిదారులకు 2019 ఫిబ్రవరి రెండున ఎమ్మెల్యే వేగుళ్ల సుమారు 14 ఎకరాల విస్తీర్ణంలోని కుర్రావారి మెట్టపై ఇళ్ల స్థలాలకు పట్టాలను పంపిణీ చేశారు. స్థలాన్ని లెవెలింగ్ చేసి, స్థలాలు అప్పగించాల్సి ఉండగా.. కేవలం పట్టాలిచ్చి చేతులు దులుపుకొన్నారు. తర్వాత మూడు వారాలకే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. మెట్ట లెవెలింగ్ పనులు జరగక లబ్ధిదారుల సొంతిల్లు కలగానే ఉండిపోయింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ తదితరులు ఈ సమస్యను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించారు. జాప్యం చేయకుండా కలెక్టర్‌తో మాట్లాడి మెట్టలోని గ్రావెల్‌ను ప్రభుత్వ స్థలాలు, జగనన్న కాలనీల్లో మెరక పనులకు తరలించారు. లెవెలింగ్ పనులు చేపట్టేందుకు అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయించారు.

గ్రావెల్ పేరుతో అడ్డంకులు

గత వారం రోజులుగా గ్రావెల్ తరలింపు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. కాగా గ్రావెల్‌ను పక్కదారి పట్టిస్తున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల, లీలాకృష్ణ ఆరోపిస్తూ మంగళవారం పనులు అడ్డుకునేందుకు కుర్రావారి మెట్టకు వస్తున్నారన్న సమాచారంతో.. 300 మందికి పైగా ఇళ్ల స్థలాల లబ్ధిదారులు మెట్ట వద్దకు చేరుకున్నారు. పనులను ఎలా అడ్డుకుని తమకు ఇళ్ల స్థలాలివ్వకుండా ఎలా చేస్తారో చూస్తామంటూ ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే వేగుళ్ల, లీలాకృష్ణ దిష్టిబొమ్మలను మెట్ట వద్ద నిలబెట్టి, కోడిగుడ్లు, టమాటాలు, చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు. కేశవరం వస్తే వారికీ ఇదే గతి పడుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడలో వేసుకుని తిరగమని పట్టాలు ఇచ్చారా అంటూ మండిపడ్డారు. ఎమ్మెల్సీ తోట చొరవతో ఇంతకాలానికి తమ కల నెరవేరుతుంటే అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. తమ గ్రామం నుంచి అక్రమంగా గ్రావెల్ తరలించుకుపోవడం మినహా గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే వేగుళ్ల చేసిందేమీ లేదని లబ్ధిదారులు విమర్శించారు. గ్రామంలోకి ఏ విధంగా అడుగుపెడతారో చూస్తామని హెచ్చరించారు. వారి వెంట పెదపాటి ఉమామహేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, తుపాకుల ప్రసన్న కుమార్, సలాది శివనారాయణ, బందెల సాయిరాం, కూసు అబ్బి, కొల్లు సుబ్రహ్మణ్యం, గనిశెట్టి సత్తిబాబు, గంధం సూరిబాబు, యడ్ల రవి, చంద్రమళ్ల లాజరు తదితరులు ఉన్నారు.

అడ్డుకోవాలని చూస్తే సహించం



ఎమ్మెల్యే వేగుళ్ల ఇచ్చిన పట్టాలు ఎందుకు పనికిరాకుండా పోయాయి. ఇంత కాలానికి ఎమ్మెల్సీ తోట చొరవతో పేదల సొంతింటి కల నెరవేరుతోంది. ఇళ్ల స్థలాల లెవెలింగ్ పనులు అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదు.

– బోదపాటి మంగ, కేశవరం

అద్దె ఇంటిలో ఉంటున్నాం



నా భర్త వ్యవసాయ కూలీ. ఇద్దరు పిల్లలతో ఎన్నో ఏళ్లుగా అద్దె ఇంటిలో ఉంటున్నాం. ఎమ్మెల్సీ తోట కృషితో త్వరలో సొంతిల్లు కట్టుకుంటామని సంబరపడుతుంటే లెవెలింగ్ పనులను అడ్డుకోవాలని చూస్తున్నారు.

– కొండేపూడి మణి, లబ్ధిదారురాలు, కేశవరం

పోలీసుల అదుపులో ఎమ్మెల్యే, జనసేన నేత

కపిలేశ్వరపురం: టీడీపీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణను మంగళవారం వల్లూరులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండపేట మండలం కేశవరంలో అక్రమ మైనింగ్ జరుగుతుందన్న పేరుతో తన అనుచరులతో లీలాకృష్ణ వల్లూరులోని తన నివాసం నుంచి బయలుదేరగా, పోలీసులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే వేగుళకల వల్లూరు వచ్చి లీలాకృష్ణకు సంఘీభావం తెలిపారు. అక్కడి నుంచి జనంతో కేశవరం బయలుదేరుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని అంగర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారితో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని, సాయంత్రం విడిచిపెట్టినట్టు పోలీసులు తెలిపారు.

11న విశ్వరూప మహాసభకు తరలిరావాలి

మండపేట: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈ నెల 11న హైదరాబాద్‌లో జరిగే విశ్వరూప మహాసభకు అధిక సంఖ్యలో మాదిగలు, ఉపకులాల వారు తరలిరావాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు దూలి జయరాజు కోరారు. స్థానిక సంఘ కార్యాలయం వద్ద విశ్వరూప మహాసభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వర్గీకరణ సాధించుకునే సమయం ఆసన్నమైందని, పార్టీలకతీతంగా ఏకమై విజయభేరి మోగించాలని కోరారు. కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, సంఘ నాయకులు చాపల వీరబాబు, పెందుర్తి కిషోర్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై సమావేశం

రామచంద్రపురం: ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్–2024పై నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నేతలతో మంగళవారం రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయంలో హెడ్ క్వార్టర్ తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 1,98,001 ఓటర్లు ఉండగా, వీరిలో 98,417 పురుష, 99,578 మహిళా, ఆరుగురు ఇతర ఓటర్లు ఉన్నారని వివరించారు. డిసెంబరు 9 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, డిసెంబరు 2, 3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు ఉంటాయని చెప్పారు. గుర్తింపు రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ కార్యాలయం నుంచి ఓటర్ల జాబితా అందుతాయని తెలిపారు. మిగిలిన వారు తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్ణీత రుసుము చెల్లించి, జాబితా పొందవచ్చన్నారు. కె.గంగవరం తహసీల్దార్ టి.వైద్యనాథ్‌శర్మ, రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

శాలివాహన కుమ్మరి సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల శాలివాహన కుమ్మరి సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం ఎంపిక మంగళవారం సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దాలిపర్తి భీమేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం అధ్యక్షత వహించారు. నూతన గౌరవాధ్యక్షుడిగా దాలిపర్తి పాపారావు, మండల అధ్యక్షుడిగా మాగాపు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కోటిపల్లి సూరిబాబు, ప్రధాన కార్యదర్శిగా ఏడిద వీరబాబు, కోశాధికారిగా పేరూరు వెంకటేష్, సంయుక్త కార్యదర్శులుగా మండా దుర్గారావు, మాచవరం వెంకటరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ర్యాలి సత్తిబాబు, సభ్యులుగా కోటిపల్లి సత్యనారాయణ, మండ ఆంజనేయులు, మానేపల్లి అచ్చారావు, సత్యనారాయణ, ఏడిద శ్రీనివాస్, అంబటి దుర్గాప్రసాద్ ఎంపికయ్యారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ పీహెచ్‌సీ పరిధిలోని ఆశా వర్కర్లు చిన్నారులకు ఐరన్ సిరప్‌లు, విటమిన్–ఏ ద్రావణం అందించాలని వైద్యాధికారి డాక్టర్ ఎస్.ప్రశాంతి సూచించారు. ద్రాక్షారామ పీహెచ్‌సీలో మంగళవారం ఆశా వర్కర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గర్భిణుల రిజిస్ట్రేషన్, టీకాల ఆన్‌లైన్ నమోదుపై సూచనలు చేశారు. సీహెచ్ఓ వీరవేణి, పీహెచ్ఎన్ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్య సమాచారాన్ని వేగవంతం చేయాలి

కపిలేశ్వరపురం: ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఆరోగ్యశ్రీ యాప్ డౌన్లోడ్ ప్రక్రియ లక్ష్యాలను త్వరితగతిన చేరుకునేలా కృషి చేయాలని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ప్రభుత్వ పథకాల నిర్వహణ తీరుపై అధికారులు, ఉద్యోగులతో సమీక్షించారు. అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల అధికారులు, వైద్య ఆరోగ్య కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. విద్య, హౌసింగ్, వ్యవసాయ తదితర శాఖల పనితీరుపై సమీక్షించారు. ఏఓ కేవీఎస్ రమేష్‌కుమార్, పీవీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



అంగరలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట



అంగరలో సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

'వై ఏపీ నీడ్స్ జగన్' సమావేశంలో ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని అంగరలో మంగళవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీలం గోవింద్ అధ్యక్షతన «వై ఏపీ నీడ్స్ జగన్» కార్యక్రమం జరిగింది. మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణబాబు, సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు వాసా కోటేశ్వరరావు, ప్రజాసంఘాలు, పార్టీ నాయకులు హాజరై.. ప్రభుత్వ సంక్షేమ పాలనా తీరును కొనియాడారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో పారదర్శకంగా సంక్షేమ పాలనను సామాన్య ప్రజలకు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చి, క్రమంతప్పకుండా ప్రభుత్వ సాయాన్ని అందిస్తున్న సీఎం జగన్ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థల పనితీరు నేడు దేశాన్ని ఆలోచింపజేస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా విజయవంతంగా పాలన సాగడాన్ని ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. ప్రజల కోసం సంక్షేమాన్ని అమలుచేస్తే, రాష్ట్రం దివాళా తీస్తుందంటూ తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నాయన్నారు. ఎన్నికల తరుణంలో ప్రతిపక్షాలు మరిన్ని తప్పుడు ప్రచారాలకు పాల్పడతాయని, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ముందుకుసాగాలని హితవు పలికారు. పార్టీ నాయకులు అబ్బు, కృష్ణబాబు, గోవింద్, దుర్గారావు, సింహాచలం మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా సాయం అందడాన్ని ఓర్వలేక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నేత లీలాకృష్ణ కలిసి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. కుల, మత, వర్గాలకతీతంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, మండల సచివాలయ కన్వీనర్ పాలింగి శ్రీనివాస్, సేవాదళ్ కన్వీనర్ కృష్ణ కిశోర్, మండలంలోని 19 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

బాబు మాయమాటలు ప్రజలు నమ్మరు



సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి వేణు, చిత్రంలో ఒమ్మి రఘురామ్



సదస్సుకు హాజరైన వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు

'వై ఏపీ నీడ్స్ జగన్' సదస్సులో రాష్ట్ర మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: తమ పబ్బం గడుపుకొనేందుకు భూత వైద్యులు మాయమాటలు చెప్పి, అమాయకులను మోసం చేస్తుంటారని, చంద్రబాబు కూడా భూత వైద్యుడిలాగే పదే పదే అవాస్తవాలు చెబుతుంటే రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మంగళవారం కాజులూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంపై వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలకు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు ఒమ్మి రఘురామ్ అవగాహన సదస్సు నిర్వహించారు. మంత్రి వేణు మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. నవరత్నాలలో భాగంగా ఇచ్చిన హామీలతో పాటు అనేక కొత్త పథకాలు అమలు చేశారన్నారు. కరోనాతో దేశం ఆర్థిక ఇబ్బందులతో సతమతమైనప్పటికీ, రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ఎక్కడా ఆపలేదని గుర్తుచేశారు. గత ప్రభుత్వాలు తాము అమలు చేసిన పథకాలకంటే వాటి పబ్లిసిటీకే ఎక్కువ ఖర్చు పెట్టారని విమర్శించారు. పథకాల అమలులోనూ దళారీ వ్యవస్థ ఉండేదని, ఫలితంగా పేదలకు లబ్ధి సక్రమంగా చేరేది కాదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆన్‌లైన్ ద్వారా ప్రతి పథకానికి బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాల్లోకే లబ్ధిని జమ చేస్తున్నారన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమష్టిగా పనిచేసి సంక్షేమ పథకాలపై ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన కలిగేలా కృషి చేయాలన్నారు. అనంతరం పార్టీ పరిశీలకుడు ఒమ్మి రఘురామ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పథకాన్ని వలంటీర్ల ద్వారానే అమలు చేయిస్తున్నారని, వారు సమర్థవంతంగా పనిచేస్తున్నారని అభినందించారు. వలంటీర్ల వ్యవస్థ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ చలవేనని, వలంటీర్లు అందుకు తగ్గట్టుగా వ్యవహరించాలని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి పార్టీ విజయానికి అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, సర్పంచ్ దండంగి సరోజిని, గృహసారథుల మండల కన్వీనర్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, తలాటం వీరన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, రాజుబాబు

మండపేట: కష్టించి పండించిన పంట దళారుల పాలవ్వకుండా ప్రభుత్వం రైతులకు అండగా ఉండి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. స్థానిక సొసైటీ వద్ద ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్‌తో కలిసి మంగళవారం ఆమె ప్రారంభించారు. చైర్మన్ గంగాధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అక్రమాలకు తావులేకుండా, పారదర్శకంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేయిస్తుందన్నారు. రాజుబాబు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా, వారిఅభ్యున్నతి కోసం పాటుపడుతున్నారని తెలిపారు. మారేడుబాక సర్పంచ్ మటపర్తి గోవిందరాజు, కౌన్సిలర్ శెట్టి కల్యాణి, పర్సన్ కొప్పిరెడ్డి కృష్ణ, శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, సీఈఓ సీహెచ్ సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు జిన్నూరి సాయిబాబా, బెల్లపుకొండ దొరబాబు, దాసరి సత్యనారాయణ, ముక్కా దాలయ్య, దుగ్గిరాల రాంబాబు, పిఠాపురం సత్యనారాయణ, తాడి రామారావు, విరాట్ రాజు, నిమ్మలపూడి రామన్న చౌదరి, తీగిరెడ్డి మహేష్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి జర్నలిస్టుల క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రెస్ క్లబ్ సభ్యులు

రామచంద్రపురం: జర్నలిస్టులకు మూడు సెంట్ల స్థలం ఇవ్వడానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన సందర్భంగా రామచంద్రపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు మంగళవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రానికి క్షీరాభిషేకం చేశారు. ప్రెస్ క్లబ్ కార్యదర్శి, జిల్లా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుడు నరాల రాధాకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు ఇంటి స్థలం కేటాయిస్తూ రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు ధన్యవాదాలు తెలిపారు. క్లబ్ ప్రింట్ మీడియా అధ్యక్షుడు కాటే భీమశంకరం, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కనికెళ్ల కనకరత్నం, జర్నలిస్టు ప్రతినిధులు చెల్లుబోయిన శ్రీనివాసు, బొమ్మా ప్రభాకర్, నరాల త్రిమూర్తులు, కుడుపూడి రమేష్, గంపల పృథ్వీరాజ్, బోడపాటి ప్రసాద్, గుబ్బల రాంబాబు, ర్యాలి శ్రీనివాస్, యనమదల శ్రీనివాస్, టి.వెంకటరమణ, శివ, బాషా పాల్గొన్నారు.

వెన్నంటే.. భరోసా

- రైతులకు ఈ ఏడాది రెండో విడత సాయం విడుదల
- ఒక్కో లబ్ధిదారునికి రూ.4 వేల చొప్పున ప్రయోజనం
- రెండు నియోజకవర్గాల్లో 53,046 మందికి లబ్ధి
- ఖాతాల్లో రూ.21,84,82,566 నగదు జమ



టేకి రైతు భరోసా కేంద్రం వద్ద లబ్ధిదారుల జాబితాను పరిశీలిస్తున్న రైతులు

మండలం	లబ్ధిపొందిన రైతు కుటుంబాలు	చేకూరిన లబ్ధి (రూ.ల్లో)
మండపేట	6,914	2,84,39,962
రాయవరం	6,783	2,79,02,667
కపిలేశ్వరపురం	8,672	3,56,73,082
రామచంద్రపురం	10,050	4,13,39,094
కాజులూరు	11,018	4,56,00,000
కె.గంగవరం	9,609	3,95,27,761
మొత్తం	53,046	21,84,82,566

కపిలేశ్వరపురం: రైతే రాజు.. అతడే దేశానికి వెన్నెముక.. ఇలాంటి నినాదాలకే పరిమితం కాకుండా, అన్నదాతకు సాధ్యమైనంత సాయం అందించాలన్న కృతనిశ్చయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోంది. సకాలంలో వ్యవసాయానికి పెట్టుబడి కోసం ఇబ్బందులు పడకుండా రైతులకు «భరోసా» ఇస్తోంది. ఈ క్రమంలోనే ఏటా మూడు విడతల్లో రూ.13,500 సాయం అందిస్తూ రైతు పక్షపాతిగా నిలిచింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. ఈ ఏడాది రెండో విడతగా ఒక్కో రైతు కుటుంబానికి రూ.4 వేల చొప్పున వారి ఖాతాలకు మంగళవారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు.

వివరాల్లోకి వెళితే..

రెండు నియోజకవర్గాలకు రూ.21,84,82,566 లబ్ధి మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 53,046 రైతు కుటుంబాలకు రూ.21,84,82,566ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ఏడాది మే నెలలో తొలి విడతగా రూ.7.500 చొప్పున జమ చేశారు. రెండో విడత రైతు భరోసాను మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు ఖాతాలకు జమ చేశారు. మండపేట నియోజకవర్గంలో 22,369 రైతు కుటుంబాలకు రూ.9,20,15,711 లబ్ధి చేకూరింది. రామచంద్రపురం నియోజకవర్గంలో 30,677 కుటుంబాలకు రూ.12,64,66,855 జమ అయింది.

క్రమం తప్పకుండా ప్రభుత్వసాయం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయినప్పటి నుంచి క్రమంతప్పకుండా రైతు భరోసా పథకం పేరుతో పెట్టుబడి సాయమందుతోంది. కరోనా కారణంగా పంట పెట్టుబడులను సమకూర్చుకోవడం కష్టంగా ఉన్న రోజుల్లో సైతం సాయం అందించడాన్ని ఆపలేదు. నేరుగా రైతు ఖాతాకే సాయాన్ని జమ చేయడం బాగుంది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. – మేడిశెట్టి శ్రీనివాస్, రైతు, టేకి

పెట్టుబడికి చేయూత



రైతు భరోసా పథకం ద్వారా రైతుకు వ్యవసాయ పెట్టుబడికి చేయూత లభిస్తోంది. పథకం అమలులో ఆర్‌బీకేల్లోని సహాయకులు చిత్తశుద్ధితో కృషి చేశారు. సాయం పారదర్శకంగా మంజూరయ్యేలా పథకం అమలవుతోంది. ప్రభుత్వ లబ్ధిని సాగు పనులకు పెట్టుబడిగా వినియోగించుకోవాలి. సాగు ప్రక్రియకు ఆర్థికసాయం చేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం దీనిని అందిస్తోంది.

– కేవీఎస్ రమేష్‌కుమార్, ఏఓ, కపిలేశ్వరపురం

పేద ప్రజల గుండె చప్పుడు సీఎం జగన్

పసలపూడి మండల స్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రాయవరం: పేద ప్రజల గుండె చప్పుడుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని పసలపూడిలో «ఏపీకి జగనే ఎందుకు కావాలి» మండల స్థాయి కార్యక్రమం మంగళవారం జరిగింది. ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ వేకువజామునే పేద ప్రజల ఇంటి తలుపు తట్టి పింఛన్లు ఇవ్వాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ సీఎం కావాలన్నారు. చదువుకునే విద్యార్థులకు అమ్మ ఒడి, ఇంగ్లిషు మీడియం చదువులు కావాలన్నా, మన బడి నాడు–నేడు పథకంలో పాఠశాలలు అభివృద్ధి చెందాలన్నా, ఇంటి ముంగిటకే ఎండీఎం వాహనాల ద్వారా రేషన్ సరకులు అందించాలన్నా, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చేయూత పథకం ద్వారా ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.18,750 అందించాలన్నా, రైతు భరోసా అందించాలన్నా.. ఇలా ప్రతి కుటుంబానికి పథకాల లబ్ధి చేకూరాలంటే తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాల్సిన చారిత్రక అవసరం ఉందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పేద ప్రజలు, రైతులు, మహిళలు, వృద్ధులు ఇలా సమాజంలో అన్ని వర్గాల వారు జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ నెల 9 నుంచి జరిగే 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. టీడీపీ మోసపూరిత ప్రచారాన్ని నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ప్రజల్లో తనపై నమ్మకం ఏర్పడిందని, దీన్ని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. వీరి మనుగడే ప్రశ్నార్థకమైందన్నారు. సమావేశంలో మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్ మాట్లాడారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన తమలంపూడి గంగాధరరెడ్డి, మండల బూత్ లెవెల్ కమిటీ కన్వీనర్ చింతా సుబ్బారెడ్డిని ఎమ్మెల్సీ త్రిమూర్తులు అభినందించారు. సర్పంచ్ కడలి పద్మావతి, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, పారిశ్రామికవేత్త చింతా వెంకటరెడ్డి, మండల సేవాదళ్ కన్వీనర్ వెలగల సత్యనారాయణరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, పార్టీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, పోతంశెట్టి సత్తిబాబు, మల్లిడి రామారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.